ప్రజాశక్తి
మంగళవారం 6 డిసెంబరు 2022
5
శ్రీకాకుళం



పర్యాటక వాణిజ్య నమోదు తప్పనిసరి

శ్రీకాకుళం: పలు రంగాల్లో ఉన్న వ్యాపార సంస్థలు వాణిజ్యంలో నమోదు చేసుకోవాలని జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎన్.నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి, పర్యాటక శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో ఉన్న హోటల్స్, రిసార్టులు, లాడ్జీలు, గెస్ట్‌హౌస్‌లు, హెరీమ్‌లు, ఫార్మ్ స్టేలు, టూర్ ఆపరేటర్లు, ట్రావెల్ ఏజెంట్లు, టూర్ బోట్ ఆపరేటర్లు, అడ్వెంచర్ గేమ్స్ ఆపరేటర్స్, వాటర్ స్పోర్ట్స్ ఆపరేటర్లు, ఎంఐసిఐ కేంద్రాలు, వెల్‌నెస్ కేంద్రాలు, సర్వీస్ అపార్ట్‌మెంట్లకు టూరిజం ట్రేడ్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయాలని పేర్కొన్నారు. పర్యాటక వాణిజ్యంలో నమోదు చేసుకున్న వారికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సాతి నిధి సర్టిఫికెట్ జారీ చేయనున్నట్లు వివరించారు. www.atourism.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. నమోదుకు సంబంధించిన దరఖాస్తులు, ఫీజు వివరాలు వెబ్‌సైట్‌లో లభ్యంగా ఉన్నాయని పేర్కొన్నారు. దరఖాస్తు నమోదు, ఇతర సందేహాలకు ఫోన్ నంబరు 6309942033 సంప్రదించాలని సూచించారు.

ప్రతిపాదనలతోనే సరి

- పట్టాలెక్కని కొత్త పరిశ్రమలు
- పలు స్థాయిల్లో పెండింగ్
- తేలని భూముల కేటాయింపు
- అనుమతుల జారీలో పలు ప్రభుత్వ శాఖల జాప్యం



పరిశ్రమలు, పెట్టుబడులు ప్రభుత్వం చెప్తున్నా, జిల్లాకు పెద్దగా వచ్చిన పరిశ్రమలు గానీ కార్మికులకు అదనంగా ఉపాధి కల్పించిన దాఖలాలు గానీ లేవు. ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాలేవీ నేటికీ పట్టాలెక్కలేదు. పరిశ్రమలకు కావాల్సిన అనుమతులు పలు స్థాయిల్లో పెండింగ్‌లో ఉండిపోతున్నాయి. భూముల కేటాయింపు, పలు ప్రభుత్వ శాఖల అనుమతుల జారీలో చేస్తున్న జాప్యం ఇందుకు ప్రధాన కారణాలు కనిపిస్తోంది. ప్రతినెలా జిల్లా పారిశ్రామిక ప్రోత్సాహ కమిటీ సమావేశమై చర్చిస్తున్నా ముందుకు సాగడం లేదు. పరిశ్రమలు వస్తే ఉద్యోగాలు వస్తాయని ఆశించిన యువతకు నిరాశే మిగులుతోంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాకు పెట్టుబడులు, పరిశ్రమలు వస్తాయని ప్రభుత్వం చెప్తున్నా అవి కాగితాల్లోనే కనిపిస్తున్నాయి. రణస్థలం మండలం సంచాంలో ఏడాదికి తొమ్మిది వేల మెట్రిక్ టన్నుల మందుల ఉత్పత్తితో రూ.350 కోట్లతో బల్క్ డ్రగ్ ఉత్పత్తులను ప్రారంభించేందుకు హైయాసింథాస్ ఫార్మా ప్రయివేట్ లిమిటెడ్ ముందుకొచ్చింది. పరిశ్రమలో ప్రత్యక్షంగా 500 మందికి, పరోక్షంగా వెయ్యి మందికి ఉపాధి కల్పిస్తామని అంగీకరించింది. పరిశ్రమకు కావాల్సిన 11.41 ఎకరాల భూమిని ప్రభుత్వం అప్పగించాల్సి ఉంది. పరిశ్రమ ఏర్పాటు చేయనున్న ప్రాంతం అనువైనదేనని అధికారులు తనిఖీ చేసి నిర్ధారించారు. ఇప్పటికీ భూమి అప్పగింతతో ఆలస్యమవుతోంది. అదేవిధంగా రణస్థలం మండలం చిట్టివలసలో రూ.720 కోట్లతో ఏడాదికి 2.50 లక్షల మెట్రిక్ టన్నుల ఔషధాలు ఉత్పత్తి చేసేందుకు సంబంధిత యాజమాన్యం ముందుకొచ్చింది. పరిశ్రమలో ప్రత్యక్షంగా 500 మందికి, పరోక్షంగా వెయ్యి మందికి ఉపాధి కల్పించేందుకు అంగీకరించింది. పరిశ్రమకు 13.91 ఎకరాల భూమి కావాల్సి ఉంది. ప్రస్తుతం భూ పరిపాలన ముఖ్య కమిషనర్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉంది. పరిశ్రమ ఏర్పాటు చేసే ప్రాంతం అనువైనదేనని అధికారులు నిర్ధారించారు. ప్రభుత్వం నుంచి ఇంకా అనుమతులు రాలేదు. ఎచ్చెర్ల మండలం అల్లినగరంలో రూ.65 కోట్లతో రసాయనిక పరిశ్రమ ఏర్పాటుకు ఎన్ఎసిఎల్ ముందుకొచ్చింది. పరిశ్రమలో 200 మందికి ఉపాధి కల్పిస్తామని అంగీకరించింది. కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు పెండింగ్‌లో ఉన్నాయి.

సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలదీ అదే పరిస్థితి

శ్రీకాకుళం మండలం సింగుపురంలో అప్పో అథంటిక్ రాక్స్ రూ.5.56 కోట్ల పెట్టుబడితో పరిశ్రమను నెలకొల్పి 20 మందికి ఉపాధి కల్పిస్తామని అంగీకరించింది. కోటబొమ్మాళి మండలం జర్జంగిలో రూ.27.25 లక్షలతో మారుతీ సామిల్లు టింబర్ డిపో ఏర్పాటు చేసి ఆరుగురికి ఉపాధి కల్పిస్తామని అంగీకరించింది. ఈ రెండు ప్రతిపాదనలు ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్నాయి. రణస్థలం మండలం సిహెచ్.రాజాంలో రూ.4.51 కోట్లతో పరిశ్రమను ఏర్పాటు చేసి 70 మందికి ఉపాధి కల్పించేందుకు సిల్వర్‌మాంట్ ప్లే అండ్ వనీర్స్ లిమిటెడ్ ముందుకొచ్చింది. పొందూరు మండలం బురిడికంచరాంలో రూ.90 లక్షలతో పరిశ్రమను ఏర్పాటు చేసి పది మందికి ఉపాధి కల్పించేందుకు గణేష్ గాయత్రి మినరల్స్ అంగీకరించింది. మధుకాన్ గ్రానైట్స్, శ్రీకేశవ స్టోన్ క్రషర్స్, గోల్డెన్ రాక్ కంపెనీ, పిఎస్ఎన్ రెడ్డి, ఎర్త్‌స్టీన్ ప్రయివేట్ లిమిటెడ్, ప్యూర్ మినరల్స్ తదితర కంపెనీలు అనుమతులు కోసం నిరీక్షిస్తున్నాయి. ప్రస్తుతం ఇవన్నీ కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్నాయి.

పరిశ్రమల ఏర్పాటుకు సమయం పడుతుంది

పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చినా వెంటనే గ్రౌండింగ్ జరగవు. కొంత సమయం పడుతుంది. భూసేకరణ, ప్రభుత్వం ఆమోదం తెలపడం వంటి ప్రక్రియలు జరగాలి. పరిశ్రమల ఏర్పాటుతో వచ్చే కాలుష్యం, ఇతర అంశాలను పరిశీలించి కాలుష్య నియంత్రణ మండలి, ఫ్యాక్టరీస్ ఇనస్పెక్టర్ అధికారులు అనుమతులు జారీ చేస్తారు. అనుమతులు జాప్యం చేయడమంటూ ఉండదు.

- ఉమామహేశ్వరరావు, ఇన్‌ఛార్జి మేనేజర్, జిల్లా పరిశ్రమల కేంద్రం



మాట్లాడుతున్న కిషోర్‌కుమార్

సర్దుబాటు పేరుతో అన్యాయం

- యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కిశోర్ కుమార్
- డిఇఒ కార్యాలయం వద్ద ఉపాధ్యాయుల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

బదిలీల ప్రస్తావన లేకుండా పని సర్దుబాటు పేరుతో ప్రభుత్వం ఉద్యోగోన్నతులపై దాటవేత ధోరణిని అవలంభిస్తోందని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ విమర్శించారు. పని సర్దుబాటు వద్దని, వెంటనే బదిలీలు చేపట్టాలని తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు నగరంలోని డిఇఒ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇచ్చి బదిలీల్లో ప్లేస్‌మెంట్ ఇస్తామని చెప్పి, బదిలీల ప్రస్తావన లేకుండా పని సర్దుబాటు చేయడం సరికాదన్నారు. ఉపాధ్యాయులను దూర ప్రాంతాల పాఠశాలలకు మార్చడం తగదన్నారు. అర్హతలు లేని సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులని బలవంతంగా ఉన్నత పాఠశాలలకు డెప్యుటేషన్ వేస్తున్నారని తెలిపారు. హైస్కూళ్లలో సబ్జెక్ట్ టీచర్స్ అవసరం అంటూ ప్రమోషన్లు పొందిన వారికి అదనంగా ఉన్నారనే నెపంతో డెప్యుటేషన్లు వేస్తున్నారని చెప్పారు. ప్రమోషన్ పొందిన వారికి తాత్కాలికంగా ప్లేస్‌మెంట్‌లు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని, ఉపాధ్యాయ లోకాన్ని గందరగోళానికి గురిచేసే విధానాలను అవలంభిస్తోందన్నారు. జిల్లాలో సుమారు 230 మంది ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు ఇవ్వడానికి ఉపాధ్యాయుల నుంచి అంగీకారాన్ని తీసుకుని, వారికి ఉద్యోగోన్నతులు ఇవ్వకుండా వేధించడం తగదన్నారు. విద్యారంగానికి పెద్దపీట వేస్తున్నామని చెప్తున్న ప్రభుత్వం, అంతర్గతంగా విద్యారంగ విచ్ఛిన్నానికి పూనుకుంటోందని విమర్శించారు.

పని సర్దుబాటు పేరిట ఉపాధ్యాయులను బదిలీ చేయడాన్ని యుటిఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. ఉద్యోగోన్నతి కల్పించిన ఉపాధ్యాయులకు తక్షణమే స్థానాలను కేటాయించి, బదిలీలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు బి.ధనలక్ష్మి, ఆర్.దమయంతి, జిల్లా కోశాధికారి బి.శ్రీరామ్మూర్తి, కార్యదర్శులు పి.సూర్యప్రకాష్, జి.శ్రీరామచంద్రమూర్తి, రాష్ట్ర కౌన్సిలర్లు జి.గిరిధర్, ఎస్.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తేజేశ్వరరావు

సమస్యలపై సమరశీల పోరాటాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు సమరశీల పోరాటాలు చేయాలని సిఐటియు జిల్లా 11వ మహాసభలు పిలుపునిచ్చాయని ఆ సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్. అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరావు తెలిపారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో పలు రంగాల కార్మికులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రవేశపెట్టిన తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదం పొందాయన్నారు. జిల్లాలో పలు రంగాలకు, యూనియన్లకు నాయకత్వం వహించిన వారితో ఉత్సాహపూరితంగా మహాసభలు ముగిశాయని తెలిపారు. ఈ మహాసభ కార్మిక వర్గంలో నూతనోత్తేజాన్ని నింపిందన్నారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్.నర్సింగరావు, ప్రధాన కార్యదర్శి ఎం.ఎ గఫూర్ భవిష్యత్ పోరాటాలు, సిఐటియు బలోపేతానికి దిశానిర్దేశం చేశారని తెలిపారు.

మూడేళ్ల కాలంలో చేపట్టిన పోరాటాలు, కార్యక్రమాలను సమీక్షించుకుని భవిష్యత్‌లో చేపట్టాల్సిన కర్తవ్యాలను మహాసభలో రూపొందించుకున్నట్లు వివరించారు. కనీస వేతనం రూ.26 వేలుగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి అమలు చేయాలని, జిల్లాలో అధునాతన వంద పడకల ఇఎస్ఐ ఆస్పత్రి నిర్మించాలని, ఇఎస్ఐ డిస్పెన్సరీల్లో మందుల కొరత లేకుండా చూడాలని తదితర తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించిందని తెలిపారు. 20 మంది ఆఫీస్ బేరర్లు, 49 మంది జిల్లా కమిటీ సభ్యులుగా మొత్తం 69 మందితో సిఐటియు నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు వివరించారు. సమావేశంలో ఎ.సత్యనారాయణ, ఎ.మహాలక్ష్మి, ఎన్.వి.రమణ, ఎం.ఆదినారాయణమూర్తి పాల్గొన్నారు.

దళారులను నమ్మొద్దు

- ప్రభుత్వమే ధాన్యం కొంటుంది
- శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని

ధాన్యం కొనుగోలులో దళారులు, మిల్లర్లను నమ్మి రైతులు మోసపోవద్దని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పట్టణంలోని పిఎసిఎస్ కృష్ణాపురం కార్యాలయం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎటువంటి అన్యాయం జరగకుండా ప్రభుత్వమే రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. ఈ-క్రాప్ చేసుకున్న ప్రతి రైతు పండించిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని చెప్పారు. గత ప్రభుత్వాల మాదిరి దళారులు, మధ్యవర్తులు, మిల్లర్ల చేతిలో రైతులు నష్టపోకుండా గ్రామాల్లోని ఆర్‌బికెల వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నేరుగా విక్రయించాలని రైతులకు సూచించారు. కనీస మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. ధాన్యం సాధారణ రకం క్వింటాకు రూ.2040, గ్రేడ్-ఎ రకానికి రూ.2060 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ప్రభుత్వం సూచించిన నాణ్యతా ప్రమాణాలను పాటించి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలన్నారు. ధాన్యం విక్రయించిన 21 రోజుల్లోపు రైతుల ఖాతాల్లో డబ్బులు నేరుగా జమ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ ఎన్ని రామచంద్రరావు, తహశీల్దార్ వై.వి పద్మావతి, మండల వ్యవసాయ అధికారి మెట్ట మోహనరావు, సిఇఒ ఆర్.రమణ, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట

ఎస్‌పి జి.ఆర్ రాధిక



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

సరిహద్దు ప్రాంతాల నుంచి మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను ఎస్‌పి జి.ఆర్ రాధిక ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఇబి) అధికారులతో ఎస్‌పి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన నెలవారీ సమీక్షా సమావేశంలో మాట్లాడారు. చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడని వారికి ఉపాధి అవకాశాలు సృష్టించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. గతంలో నమోదైన అండ్ డిటెక్టబుల్ కేసులను వీలైనంత త్వరగా ఛేదించి అనుమానితులైన పాత నేరస్తులపై నిఘా ఉంచి నిందితులను త్వరితగతిన అరెస్టు చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తు పూర్తి చేసి ఛార్జిషీట్లు కోర్టులో దాఖలు చేయాలన్నారు. క్రమేపీ నేరాలకు పాల్పడిన వారిపై ప్రత్యేక దృష్టిసారించి వారిపై బైండోవర్ నమోదు చేయాలని ఆదేశించారు. కేసుల దర్యాప్తులో జాగ్రత్తలు పాటించి సమగ్ర విచారణ చేసి నేర నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. నాటుసారా తయారీ, విక్రయ కేంద్రాలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఆయా గ్రామాల్లో కార్డాన్ సెర్చ్ చేపట్టి నాటుసారా తయారీకి వినియోగించే ముడి పదార్థాలను నిర్వీర్యం చేయాలని సూచించారు. జిల్లా, రాష్ట్ర సరిహద్దుల్లోని చెక్‌పోస్టుల వద్ద ఆకస్మిక తనిఖీలు చేపట్టి ఇతర ప్రాంతాల నుంచి గంజాయి, గుట్కా, ఖైనీ, మద్యం రవాణా కాకుండా పక్కా ప్రణాళికతో ఆకస్మిక దాడులు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్ఇబి జాయింట్ డైరెక్టర్ వి.నాగమణికంఠ, అసిస్టెంట్ కమిషనర్ కె.పి గోపాల్, ఎస్ఇబి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సాయుధ దళాల పతాక దినోత్సవం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

శ్రీకాకుళం అర్బన్: సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని ఈనెల ఏడో తేదీన నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పతాక దినోత్సవ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. జిల్లాలోని సైనికులు, మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులకు సాయుధ దళాల పతాక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. భారత సైనిక దళాలు, మొక్కవోని దీక్షతో చూపిన దేశభక్తి, సాహసం, త్యాగాలపై దేశం గర్విస్తోందన్నారు. పాకిస్థాన్, చైనా యుద్ధ సమయాల్లో, కార్గిల్ యుద్ధంలో ప్రకృతి వైపరీత్యాల సమయంలో సైనికుల ధైర్య సాహసాలు, తెగువకు జాతి యావత్తు గర్విస్తోందన్నారు. ఎంతోమంది సైనికులు దేశ రక్షణలో ప్రాణాలు అర్పించారన్నారు. వీర జవాన్లకు వందనం సమర్పించేందుకు, వారి కుటుంబాలకు చేయూతనిచ్చేందుకు సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పతాక నిధికి ప్రజలు విరివిగా విరాళాలు అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెసి ఎం.నవీన్, డిఆర్ఒ రాజేశ్వరి, సైనిక సంక్షేమశాఖ అధికారి, తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక సారాంశ సవరణపై సమావేశం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రత్యేక సారాంశ సవరణపై ఈనెల ఆరో తేదీన సమావేశం నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి నుంచి 11 గంటల వరకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇఆర్‌ఒలతో ఇంటరాక్షన్ ఉంటుందని పేర్కొన్నారు. స్పెషల్ సమ్మరీ రివిజన్-2023 కోసం రోల్ అబ్జర్వర్‌గా రాష్ట్ర డెయిరీ అభివృద్ధి కో-ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, ఎపి అమూల్ ప్రత్యేక అధికారి అహ్మద్ బాబును నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అబ్జర్వర్ పాల్గొంటారని తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని తెలిపారు.

పథకాల అమల్లో జిల్లాకు ఐదో స్థానం



కలెక్టర్‌ను సన్మానిస్తున్న జిల్లా అధికారులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాలు, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమల్లో రాష్ట్రంలో జిల్లా ఐదో స్థానంలో నిలిచింది. జెడ్‌పి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను పలువురు జిల్లా అధికారులు అభినందనలు తెలిపి సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అందరి భాగస్వామ్యంతోనే రాష్ట్రస్థాయిలో జిల్లాకు ఐదో స్థానం లభించిందన్నారు. మరింత బాగా పనిచేస్తే ముందుకు వెళ్తామని, లేకుంటే ర్యాంకింగ్ మారుతుందని చెప్పారు. అభినందనలు తెలిపిన వారిలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, ఉప కలెక్టర్ జి.జయదేవి, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, డిపిఒ రవికుమార్, డ్వామా, డిఆర్‌డిఎ పీడీలు చిట్టిరాజు, విద్యాసాగర్, డిపిఆర్ఒ కె.బాలమాన్ సింగ్ తదితరులున్నారు.

నువ్వగూడ గిరిజనులకు పట్టాలు ఇవ్వాలి

- రైతు, గిరిజన సంఘాలు డిమాండ్
- తహశీల్దార్ కార్యాలయం వద్ద గిరిజనుల ధర్నా



తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి - కంచిలి

ఏళ్ల తరబడి అటవీ భూములను సాగు చేస్తున్న నువ్వగూడ గిరిజనులకు న్యాయం చేయాలని, వారి పేరుపై అడంగల్, 1బి ఇచ్చి భూమిపై హక్కు కల్పించాలని ఎపి రైతు సంఘం, గిరిజన సంఘం డిమాండ్ చేశాయి. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ హైమావతికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కోనారి మోహనరావు, మండల కార్యదర్శి కె.గోపీనాత్, గిరిజన సంఘం నాయకులు రాజేంద్ర, అప్పన్న నాయక్ మాట్లాడుతూ సుమారు 200 గిరిజన కుటుంబాలు ఏళ్ల తరబడి నువ్వగూడలో భూములను సాగు చేస్తున్నాయని, అదే వారి జీవనాధారమని అన్నారు. 1బి, అడంగల్, పట్టాదారు పాస్ పుస్తకం కోసం ఎన్నోసార్లు వారు దరఖాస్తు చేసుకున్నా అధికారులు మొండి చేయి చూపారని అన్నారు. సాగు భూములపై హక్కులు లేకపోవడంతో పంట నష్టం జరిగినా ప్రభుత్వం నుంచి ఎటువంటి నష్టపరిహారం అందడం లేదన్నారు. బ్యాంకు రాయితీలు, ప్రభుత్వ పథకాలు అందడం లేదన్నారు. ఇప్పటికైనా సమగ్ర సర్వే జరిపి నువ్వగూడ గిరిజన రైతులకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో గిరిజన రైతులతో కలిసి పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు రుషి, రవీంద్ర, మహిళా రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మరింత మెరుగ్గా రీ సర్వే

- ఒత్తిళ్లకు తలొగ్గద్దు
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష కార్యక్రమంలో భాగంగా జిల్లాలో చేపడుతున్న రీ సర్వే మరింత మెరుగ్గా చేపట్టాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. సర్వే, భూ రికార్డుల శాఖ ఆధ్వర్యాన జగనన్న శాశ్వత భూ హక్కు - భూ రక్ష రీ సర్వేపై శ్రీకాకుళం డివిజన్ స్థాయి శిక్షణా కార్యక్రమాన్ని నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రీ సర్వే ప్రారంభించాక ఇప్పటివరకు 380 గ్రామాల్లో పూర్తయి, భూ హక్కు పత్రాలను జారీ చేసినట్లు తెలిపారు. సుమారు వందేళ్ల తర్వాత చేపడుతున్న ఈ సర్వే పక్కాగా ఉండాలన్నారు. ఇది సక్రమంగా పూర్తి చేస్తే మరో వందేళ్ల వరకు రీ సర్వే చేయాల్సిన అవసరం ఉండబోదన్నారు. 1907లో బ్రిటిష్ కాలంలో చేపట్టిన రీ సర్వేను ఇప్పటికే ప్రామాణికంగా తీసుకుంటున్నామన్నారు. ఈ సర్వే కూడా పక్కాగా ఉండాలని ఆకాంక్షించారు. క్షేత్రస్థాయిలో తలెత్తే సమస్యలు, సాంకేతికపరమైన సమస్యల దృష్ట్యా రీ సర్వేలో ప్రభుత్వం అనేక మార్పులు చేస్తూ వచ్చిందన్నారు. రీ సర్వే చేపట్టే గ్రామ, మండల సర్వేయర్లు, విఆర్‌ఒలు, మొబైల్ మెజిస్ట్రేట్లు, ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్లకు సర్వే వివరాలు క్షుణ్ణంగా తెలిసి ఉండాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో తలెత్తే సమస్యలు, ఇబ్బందులు, సందేహాలు నివృత్తి చేసుకునేందుకు ఈ సదస్సు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రీ సర్వేతో రికార్డుల ప్రక్షాళన జరుగుతుందని తెలిపారు. రీ సర్వేలో ఎటువంటి ఒత్తిళ్లకు తలొగ్గద్దన్నారు. వచ్చే వంద రోజుల్లో 250 గ్రామాలు రీ సర్వే పూర్తయ్యేలా కృషి చేయాలన్నారు. శిక్షణ సదస్సును సద్వినియోగం చేసుకుని నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు.

రీ సర్వే కార్యక్రమంలో గ్రామ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులది కీలకపాత్ర అని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. భూ హక్కు పత్రాల జారీలో ఎటువంటి తప్పులకు తావివ్వరాదని స్పష్టం చేశారు. ఇప్పటికే జారీ చేసిన పత్రాల మాదిరిగా కాకుండా మరింత మెరుగైన పత్రాల జారీకి గల సూచనలు, సలహాలను తెలియజేయాలని కోరారు. క్షేత్రస్థాయిలో సర్వేలో ఎదురయ్యే సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లాలో 1,100 గ్రామాల్లో నిర్వహించే రీ సర్వే డాక్యుమెంటేషన్ పక్కాగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ బి.శాంతి, సర్వే, భూరికార్డుల శాఖ సహాయ సంచాలకులు కె.ప్రభాకరరావు, తహశీల్దార్లు, మండల, గ్రామ సర్వేయర్లు, విఆర్‌ఒలు తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న స్పీకర్ సీతారాం

బిసిల మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- ఆమదాలవలస
బిసిలకు వైసిపి ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తుందని, అందులో భాగంగా ఈనెల 7నప విజయవాడలో నిర్వహించనున్న జయహో బిసి మహాసభను నిర్వహిస్తున్నామని, బిసిలు పాల్గొని విజయవంతం చేయాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కళ్యాణ మండపంలో నియోజకవర్గ నాయకులతో, కార్యకర్తలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిసిలకు సిఎం జగన్మోహన్‌రెడ్డి వెన్నెముకగా నిలుస్తూ అండదండలు అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, జెడ్‌పిటిసిలు బెండి గోవిందరావు, సురవరపు నాగేశ్వరరావు, లోలుగు కాంతారావు, కె.వి.జి. సత్యనారాయణ, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, జె.జె.మోహనరావు, ఎన్ని రామచంద్రరావు, అల్లంశెట్టి ఉమామహేశ్వర రావు, బొడ్డేపల్లి నారాయణరావు, రమేష్ కుమార్ పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ వద్ద ధర్నా

శ్రీకాకుళం అర్బన్ : ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను, జాప్యాన్ని నిరసిస్తూ ఎస్‌టియు ఆధ్వర్యాన ఈ నెల 7న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొండు మధుసూదనరావు, ఎస్.వి.రమణ, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పేడాడ ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగోన్నతుల ద్వారా విల్లింగ్ ఇచ్చిన ఉపాధ్యాయులకు స్థానాలు కేటాయిస్తూ ఆర్డర్లు ఇవ్వాలన్నారు. బదిలీలు చేపట్టకుండా పని సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయులను దూరప్రాంతాలకు పంపే ప్రతిపాదనలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలు, పిఎఫ్, ఎపిజి ఎల్ఐ రుణాలు చెల్లించాలని కోరారు. ఈ ధర్నాలో పెద్దఎత్తున ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.


విద్యార్థులతో ప్రిన్సిపాల్ పద్మజ

పుస్తక పఠనం అవసరం

టెక్కలి: విద్యార్థులకు పుస్తక పఠనం తప్పనిసరి అని, అప్పుడే విషయ సమగ్రత ఏర్పడుతుందని రవీంద్రభారతి పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజ అన్నారు. పాఠశాల ఆవరణలో సోమవారం విద్యార్థులకు ఆర్‌బిఎస్ క్లబ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుస్తకాన్ని చదవడం వల్ల విద్యార్థులు అనేక ప్రయోజనాలు పొందవచ్చని అన్నారు. చదువులో మరింత నైపుణ్యాలు, మెలకువలు నేర్చుకోవచ్చని అన్నారు. ఈ సందర్భంగా పుస్తక పఠనంలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు పద్మజ బహుమతులు అందజేశారు. డీన్ నాగరాజు పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజేతలకు అభినందనలు

పోలాకి : ఈదులవలస ఎపి మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాల విద్యార్థులను ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ అభినందించారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఇక్కడ చదువుతున్న విద్యార్థులు బాల్ బ్యాడ్మింటన్ అండర్-17కు సాయి కృష్ణ, త్రోబాల్ అండర్-17లో ఎం.శిరీష, వై.మౌనిక, యశస్విని, ప్రణయ్ ఎంపికయ్యారని తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను ఆమెతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు నీలం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎంపీ నిధుల పనులను ప్రారంభించాలి

- స్పందనలో కోరిన శివాజీ, శిరీష
- 200 వినతులు స్వీకరణ


వినతిపత్రం అందజేస్తున్న శిరీష

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
జిల్లాలోని పలాస నియోజకవర్గం పరిధిలో ప్రజలపై అక్కడి అధికారులు వివక్షత చూపుతున్నారని, ఉద్దేశ్య పూర్వకంగానే ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వాటిని సరిదిద్ది ప్రజలకు న్యాయం చేయాలని మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషలు కోరారు. జెడ్‌పి సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి పాల్గొని పలాస నియోజకవర్గం పరిధిలో ఎదురవుతున్న ఇబ్బందులను కలెక్టర్‌కు వివరించారు. మందస మండలం భేతాళపురం, సరియాపల్లి గ్రామాల్లో అభివృద్ధి పనులకు పార్లమెంట్ సభ్యులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు నిధులు మంజూరు చేశారని, కానీ, ఇంతవరకు సంబంధిత అధికారులు పనులు ప్రారంభించలేదని వివరించారు. విద్యుత్ లైన్ల మార్పిడితో పాటు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయడంలో వివక్షత ఉందన్నారు. అలాగే ఈ ెండు గ్రామాల్లో తాగునీటి అవసరాను తీర్చేందుకు రూ.5 లక్షలు నిధులు మంజూరు చేసినా ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదని పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అలాగే పలాస మున్సిపాలిటీలో టిడిపికి అనుకూలంగా ఉన్నాయన్న కారణంతో తాగునీటి సరఫరాను తరచూ నిలిపి వేస్తూ అక్కడి ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో భాగంగా ఎండియు ఆపరేటర్లకు ఇచ్చిన హామీల జిఒలను అమలు చేయాలని ఆపరేటర్లు కోరారు. రేషన్ వెహికల్ ఇన్స్యూరెన్స్ డబ్బులు ఆపరేటర్ల ఖాతాలో నుంచి రూ.11 నుంచి రూ.15 వేలు కట్ చేశారని అన్నారు. ఆ మొత్తాన్ని తిరిగి చెల్లిస్తామని చెప్పి ఇంతవరకు ఖాతాల్లో జమ చేయలేదని వివరించారు. ఎండిఎం, ఐసిడిఎస్ పథకాలకు రెండు నెలలుగా రేషన్ పంపిణీ చేస్తున్నా... వాటికి సంబంధించిన రవాణా ఛార్జీలు చెల్లించడం లేదని వివరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎండియు ఆపరేటర్లు సూర్యనారాయణ, రాజా, నరేష్, హేమసుందర్, నవీన్, సాయిరాజ్, అనిల్, శ్రీనివాస్, ఢిల్లీరావు, అప్పలనాయుడు, విశ్వనాథం, బాలకృష్ణ, మోహన్ ఉన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యలతో కూడిన 200 వినతులను కలెక్టర్, జెసిలు స్వీకరించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ స్పందనతో పాటు ఎపి ఆన్‌లైన్ ద్వారా వస్తున్న వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. సమస్యలను పరిష్కరించే సమయంలో తప్పని సరిగా ఫొటోలు ఉండాలన్నారు. సమావేశంలో డిఆర్ఒ రాజేశ్వరి, డెప్యూటీ కలెక్టర్ జయదేవి, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, జెడ్‌పి సిఇఒ వెంకటరామన్, డిపిఒ రవికుమార్, డిఇఒ పగడాలమ్మ పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లను అందజేయాలి


ఆందోళన చేస్తున్న సిపిఐ నాయకులు

శ్రీకాకుళం అర్బన్ : టిడ్కో గృహ నిర్మాణాలు పూర్తయినా రాజకీయ కారణాలతో లబ్ధి దారులకు అందించకపోవటం దారుణమని, వెంటనే లబ్ధిదారులకు ఇళ్లను అందజేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. నగరంలోని తహశీల్దార్, నగర పాలక సంస్థ కార్యాలయాల వద్ద సోమవారం ఆందోళన చేపట్టి వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న ఇళ్లకు ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షలు సరిపోవడం లేదని అన్నారు. దీంతో అధిక వడ్డీలకు అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. ప్రస్తుతం ఉన్న ధరలకు అనుగుణంగా రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాలనీల్లో తాగునీరు, డ్రెయినేజీ, రోడ్లు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమం నగర కార్యదర్శి డోల శంకరరావు, ఎఐటియుసి జిల్లా గౌరవ సలహాదారు చిక్కాల గోవిందరావు, మహిళా సమాఖ్య నాయకులు పట్టా ప్రభావతి, జిల్లా సమితి సభ్యులు నిమ్మాడ కృష్ణ, చింతు ఎరయ్య పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

సోంపేట : మండలంలోని మామిడిపల్లి గ్రామ పూర్వ విద్యార్థుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక సోమవారం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ పాతిన శేషగిరి, ఎంపిటిసి డి.మాధవరావు, గ్రామ పెద్దలు గోరకల లక్ష్మణరావు, కోదండ కృష్ణ, రైతు సంఘం నాయకుడు మర్రి లోకనాథ్, కమిటీ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ నూతన గౌరవ అధ్యక్షుడిగా టి.పాపారావు, అధ్యక్షుడుగా బి.సింహాచలం, ఉపాధ్యక్షుడుగా జి.దొరబాబు, ప్రధాన కార్యదర్శిగా పి.ప్రసాద్, సహకారదర్శిగా ఎస్ చిరంజీవి, కోశాధికారిగా సింహాచలంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి చేయూత అందిస్తామన్నారు.

'ఇదేమి ఖర్మ' అచ్చెన్న

ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్


శ్రీనివాస్, ఎమ్మెల్సీ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్
ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు మూడున్నర ఏళ్లుగా నియోజకవర్గ కేంద్రంలో అడుగు పెట్టలేదని, ఇదేం కర్మ అచ్చెన్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రానికి పట్టిన అతిపెద్ద ఖర్మ చంద్రబాబు అని అన్నారు. జగన్ పాలన చేసి దేశం మొత్తం రాష్ట్రం వైపు చూస్తోందని అన్నారు. మూడున్నర ఏళ్లలో టెక్కలి నియోజకవర్గానికి రూ.10.26 కోట్లను సిఎం సంక్షేమ పథకాలకు ఖర్చుపెట్టారని అన్నారు. మూడున్నరేళ్లలో అచ్చెన్న నియోజకవర్గంలో అడుగు పెట్టలేదని అన్నారు. కరోనా కష్టకాలంలో ఒక్క పేదవాడికైనా రూపాయి సాయం చేశారా? అని ప్రశ్నించారు. రూ.4200 కోట్లతో పోర్టు నిర్మిస్తున్నామని, రూ.70 లక్షల కోట్ల బడ్జెట్ ఒక్క బిసిల కోసం ఖర్చుచేశారని అన్నారు. ఈ సందర్భంగా జయహో బిసి గర్జన పో స్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వారణాసి గోవిందరావు, సిగులుపల్లి మోహన్‌రావు, చింతాడ బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మన చరిత్ర మనమే రాసుకోవాలి

కళింగ శివంగి పుస్తకావిష్కరణ సభలో వక్తలు


కళింగ శివంగి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

ప్రజాశక్తి- పలాస
ఎంతోమంది ఉద్యమకారులకు జన్మనిచ్చిన ఈ ప్రాంత చరిత్రను మనమే రాసుకోవాలని, అవగాహన లేని వ్యక్తులకు అవకాశం ఇస్తే చరిత్ర వక్రీకరించబడుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. సీనియర్ జర్నలిస్ట్, రచయిత నల్లి ధర్మారావు రచించిన 'కళింగ శివంగి వీర గున్నమ్మ' నవలను సోమవారం మున్సిపాలిటీలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆవిష్కరించారు. సిపిఐ నాయకులు చాపర వేణుగోపాల్ అధ్యతన నిర్వహించిన సమావేశంలో వైద్యులు దువ్వాడ జీవితేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో స్వాతంత్రోద్యమానికి ప్రేరణ వీరగున్నమ్మ పోరాటమని కొనియాడారు. వీర గున్నమ్మ కోసం మాట్లాడటం అంటే ఈ ప్రాంత ఉద్యమాల కోసం మాట్లాడుకోవడమేనని తెలిపారు. బొడ్డేపల్లి మోహన్ రావు మాట్లాడుతూ ఇటువంటి వేదికలు ద్వారా వీర గున్నమ్మ చరిత్రను సజీవంగా నిలపాలని కోరారు. దువ్వాడ శ్రీధర్ మాట్లాడుతూ గున్నమ్మ చరిత్ర ఈ ప్రాంతానికి పరిమితం కాకూడదని, రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రజలకు తెలిసేలా ఇటువటి నవలలు మరిన్ని ముద్రించాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు మాట్లాడుతూ చరిత్ర దాచేస్తే దాగదన్నారు. ప్రశ్నించే తత్వం ఉంటేనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందన్నారు. కార్యక్రమంలో దుప్పల రవీంద్ర, హేమబాబు చౌదరి, సిపిఐ నాయకులు చాపర సుందర్లాల్, సిపిఎం నాయకులు ఎస్.గణపతి, జుత్తు నీలకంఠం, జ్యోతి ఫెడరిక్, టి.గోవిందమ్మ, వినోద్, రాజారావు, తదితరులు పాల్గొన్నారు.


చికిత్స పొందుతున్న భారతి

మహిళకు గాయాలు

బూర్జ : మండలంలోని మదనాపురం వద్ద సోమవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే... వీరఘట్టంకు చెందిన పొడుగు భారతి తన భర్త రామారావుతో కలిసి బైక్‌పై కోటబొమ్మాళి వెళ్తున్నారు. మదనాపురం వద్ద ఉన్న గోతిలోకి బైక్ వెళ్లిపోవడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో భారతి తలకు తీవ్ర గాయం కాగా, రామారావు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. వెంటనే స్థానికులు జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై ఎస్ఐ అశోక్‌బాబుకు వివరణ కోరగా ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఎమ్మెల్యే కిరణ్ కుమార్ పరామర్శ

జి.సిగడాం : మండలంలోని పెనశాంకు చెందిన భవానీ స్వాములు ఇటీవల విజయవాడ కొండకు కాలినడకను వెళ్లారు. తుని వద్ద కారు ఢీకొన్న ప్రమాదంలో నల్ల ఈశ్వరరావు, రావి సంతోష్‌కుమార్ మృతి చెందారు. దీంతో ఆయా కుటుంబ సభ్యుల్లో విషాదం నెలకుంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మృతుల కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించి తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. పరామర్శించిన వారిలో ఎంపిపి ప్రతినిధి మీసాల వెంకటరమణ, జెడ్‌పిటిసి కాయల రమణ, సర్పంచ్ తొత్తడి రామారావు, ఎంపిటిసి కుదిరెళ్ల సుజాత ఉన్నారు.


ఫాగింగ్ పనులను పరిశీలిస్తున్న గిరిబాబు

దోమల నివారణకు చర్యలు

ప్రజాశక్తి- పొందూరు
మండలంలోని రాపాకలో సర్పంచ్ ప్రతినిధి కొంచాడ గిరిబాబు ఆధ్వర్యాన సోమవారం దోమల నివారణకు చర్యలు చేపట్టారు. మస్కిటో ఫాగింగ్ యంత్రం ద్వారా గ్రామంలోని అన్ని వీధుల్లోని కాలువల్లో పొగబెట్టి దోమల నివారణ చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ సిహెచ్.శాంతిస్వరూప్, ఎఎన్ఎంలు వనజాక్షి, ఉదయ్‌లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ రమణ, ఆశాకార్యకర్తలు లక్ష్మి, ఉష, రాజేశ్వరి, పుణ్యవతి పాల్గొన్నారు.

వాలంటీర్లకు ఇంటర్వ్యూలు

ఇచ్ఛాపురం: మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రమేష్ ఆధ్వర్యాన వాలంటీర్లకు సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. 13 పోస్టులకు 34 మంది ఆన్‌లైన్ దరఖాస్తుచేసుకున్నారని తెలిపారు. వారిలో 28 మంది హాజరయ్యారని తెలిపారు. వీరికి మేనేజర్ హరిమోహన్, జూనియర్ అసిస్టెంట్ మహేష్, సిఎంఎం జానకిరామారావు ఇంటర్వ్యూలు చేశారు.


ప్రజలపై ధరల బాదుడు


వజ్రపుకొత్తూరు : మాట్లాడుతున్న శిరీష

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు
జగన్మోహన్‌రెడ్డి తన పాలనలో ప్రజలపై భారాలు మోపి, అన్ని విధాలుగా బాదేస్తున్నారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. సోమవారం అక్కుపల్లిలో నిర్వహించిన ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధరలు పెరిగి ప్రజల కొనుగోలుశక్తి పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో వైసిపికి ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు సురాడ మోహన్‌రావు, టిడిపి నాయకులు శశిభూషణ్, పి.సాంబమూర్తి, సనపల చక్రవర్తి, దువ్వాడ అప్పారావు, బాలకృష్ణ, దుర్యోధన, తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండలంలో జలకలింగపురం గ్రామంలో సోమవారం మాజీ శాసనసభ్యులు కలమట వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. చంద్రబాబు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజలపై భారాలను తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు భాస్కర్ గౌడ్, జిల్లా మహిళా ఉపాధ్యక్షులు బూర్ల లలితకుమారి, సర్పంచ్ ప్రతినిధి రవ్వల గణపతిరావు, వసంతరావు, శ్రీధర్, దినకర్, రుక్మాంగధరరావు, ఒట్టి కోళ్ల చక్రి, శశిభూషణ్, శంకర్, పరమేశ్, పడాల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

డిటిఎఫ్ మండల కార్యవర్గం ఏకగ్రీవం


ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

పొందూరు: డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ మండలశాఖ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి, డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కొమ్ము అప్పలరాజు తెలిపారు. మండలంలోని లైదాం ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. డిటిఎఫ్ మండల అధ్యక్షులుగా బలివాడ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా సీపాన భాస్కరరావు, ఉపాధ్యక్షులుగా గన్నెం రామారావు, టి.రత్నకుమారి, మండల కార్యదర్శు లుగా సనపల లక్ష్మణరావు, టి.విభీషణరావు, జి.శ్రీనివాసరావు, సిహెచ్. వేణుగోపాల్, జి.రాజారావు, జిల్లా కౌన్సిలర్లుగా గురుగుబెల్లి గోపాలరావు, పూజారి హరిప్రసన్న, తమ్మినేని మురళీధరరావు, గురుగుబెల్లి భాస్కరరావులు ఎన్నికైనట్లు ప్రకటించారు. సమావేశంలో ఉపాధ్యాయులకు రావాల్సిన డిఎ, జడ్.పి.పి.ఎఫ్ బకాయిలు, ఆర్జిత సెలవులకు సంబంధించి బిల్లులు మంజూరు, సస్పెండ్ చేసిన ఉపాధ్యాయులను విధుల్లో తీసుకోవాలని తదితర సమస్యలపై చర్చించి తీర్మానాలు చేశారు.

మారుతీ వాకర్స్ సేవలు విస్తృతం


మాట్లాడుతున్న మురళీధర్

శ్రీకాకుళం అర్బన్ : మారుతీ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన కొన్నేళ్లుగా చేపడుతున్న సేవా 2023లో మరింతగా విస్తరించాలని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు కొంక్యాన మురళీధర్ పిలుపునిచ్చారు. ఒడిశా రాష్ట్రం గండాహతి జలపాతాన్ని మారుతీ వాకర్స్ క్లబ్ అఫీస్ బేరర్లు, మెంబర్లు, కుటుంబ సభ్యులతో సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా గండాహతి అటవీశాఖ అతిథిగృహం వద్ద నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ ఏడాది ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టామని, ఇదేస్ఫూర్తితో భవిష్యత్‌లో కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అనంతరం వాకర్స్ కుటుంబ సభ్యులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. పాతపట్నం అమ్మవారి ఆలయాన్ని వాకర్స్ బృందం సందర్శించింది. కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ గవర్నర్ వి.భీమరాజు, కార్యదర్శి పొట్నూరు నాగేశ్వరరావు, నిర్వాహక కార్యదర్శి ఎస్.రాజేంద్రప్రసాద్, యోగా గురువు ఓంకార స్వామి, మారుతీ వాకర్స్ ప్రతినిధి ఎస్.గోవింద రావు, విశ్వనాథం, మన్మథరావు పాల్గొన్నారు.

బిసిలకు ప్రభుత్వం మొండిచేయి


శ్రీకాకుళం అర్బన్ : వినతిపత్రం అందజేస్తున్న లక్ష్మీదేవి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
రాష్ట్రంలో బిసిల సమస్యలను ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పూర్తిగా విస్మరించారని, కార్పొరేషన్లను నిర్వీర్యం చేస్తూ సంక్షేమ పథకాలను రద్దు చేశారని మాజీ ఎమ్మెల్యే గుండలక్ష్మీదేవి ధ్వజమెత్తారు. బిసిలకు తాడేపల్లి ప్యాలస్‌లోకి ప్రవేశం కల్పించని ముఖ్యమంత్రికి వారి సమస్యలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. 'బిసిలకు ఇదేం ఖర్మరా బాబూ' అంటూ టిడిపి ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. అనంతరం ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ ధర్మాన ప్రకాశరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిసిలకు టిడిపి హయాంలో అన్ని విధాలా అగ్రభాగాన నిలిపిందన్నారు. పార్టీ పదవుల్లోను సముచిత స్థానం కల్పించామన్నారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులుగా గతంలో కళా వెంకటరావు, ప్రస్తుతం అధ్యక్షులులు అచ్చెన్నాయుడు బిసిలకు చెందిన వారేననిగుర్తు చేశారు. బిసిలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి చైర్మన్, డైరెక్టర్లుగా ఉన్న ఉన్న వైసిపి నాయకులకు రూ.లక్షలు నిధుల నుంచి చెల్లిస్తూ పాత పథకాలను దారి మళ్లించేశారని ఆరోపించారు. కార్యక్రమంలో సింతు సుధాకర్, గుండ శంకర్, కరగాన రామ్మోహన్ పాల్గొన్నారు.

ఆమదాలవలస : రాష్ట్ర జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న వెనుకబడిన తరగతులు చెందిన బిసిలకు వైసిపి ప్రభుత్వం దగా చేసిందని టిడిపి మండల అధ్యక్షులు నూకరాజు, మొదలవలస రమేష్ అన్నారు. పట్టణంలోని టిడిపి కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు టిడిపి నాయకులు సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యాలయం దగ్గర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం సూపరింటెండెంట్ రాంబాబుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా మహిళా అధ్యక్షులు తమ్మినేని సుజాత, ఎంపిటిసి అన్నెపు భాస్కరరావు, సర్పంచ్‌లు బొడ్డేపల్లి గౌరీపతి, సనపల చెల్లంనాయుడు, గొండు రమణ, గుజ్జల లక్ష్మణరావు, ఎండ అప్పలనాయుడు, రామ్‌శంకర్, నేతింటి జ్యోతి, సంపదరావు మురళి పాల్గొన్నారు.

బూర్జ : బిసిలకు టిడిపి హయాంలోనే న్యాయం జరిగిందని మండల అధ్యక్షులు వావిలిపల్లి సీతారాంబాబు నాయుడు అన్నారు. బిసిలకు న్యాయం చేయాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం తహశీల్దార్ ఎన్.రమణారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి మాజీ సభ్యులు ఎ.రామకృష్ణ పి.కన్నంనాయుడు, సర్పంచ్‌ల ప్రతినిధులు అంపిలి గణపతరావు, హనుమంతు గోపి, వెంకటరమణ, కడగల కృష్ణ, దాసిరెడ్డి వెంకినాయుడు పాల్గొన్నారు.

లావేరు : వైసిపి ప్రభుత్వం బిసిలకు అన్యాయం చేస్తుందని బిసిసెల్ నియోజకవర్గ అధ్యక్షులు గొర్లె శ్రీనివాసరావు అన్నారు. బిసిలకు ఇదేం ఖర్మ మన పేరుతో తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం తహశీల్దార్ ఎస్.దిలీప్‌చక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి మీసాల వెంకట రమణ, చార్లెస్, ఆర్.ప్రకాశరావు, సత్తిబాబు, గోపాలరావు, అప్పలనాయుడు, సాయి పాల్గొన్నారు.

పొందూరు : రాష్ట్రంలో 50 శాతానికి పైగా ఉన్న బిసిలకు ప్రభుత్వం చేస్తున్న అన్యాయంపై నిరసిస్తూ టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహనరావు తహశీల్దార్ ఎస్.గణపతిరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బిసిసెల్ అధ్యక్షులు చింతాడ కృష్ణవాసుదేవరా, బి.శంకరభాస్కరరావు, ఎస్.శ్రీరంగనాయకులు, అన్నెపు రాము, గిరి, ఎ.రంగా, కె.అప్పలనాయుడు, ఎస్.మధు, కె.శాంతారాం, శ్రీనివాసరావు, బి.సత్యం, వాసుదేవరావు, రమణ, కామరాజు, గోవింద, రాంబాబు పాల్గొన్నారు.

జి.సిగడాం : బిసిలకు ఇదేం ఖర్మరా బాబూ కార్యక్రమంలో భాగంగా టిడిపి మండల అధ్యక్షులు కుమరాపు రవికుమార్ తహశీల్దార్ పప్పల వేణుగోపాలరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కవిటి: రాష్ట్రంలో బిసిలకు తీరని అన్యాయం జరుగుతోందని, తక్షణమే దారి మళ్లించిన బిసి కార్పొరేషన్, సబ్‌ప్లాన్ నిధులను వారి పురోభివృద్ధికి అందించాలని టిడిపి మండల నాయకులు పి.కృష్ణారావు, సీపాన వెంకటరమణ కోరారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయ సీనియరు అసిస్టెంట్ కె.రమణమూర్తికి సోమవారం వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ మత్స్యకారులకు సబ్సిడీపై వలలు, పడవలు పంపిణీ చేసి జిఒ 217ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బెందాళం రమేష్, యర్రా బాసుదేవ్ ప్రధాన్, కొర్రాయి వాసుదేవ్, లోళ్ల శ్రీను, పుల్లట సంతోష్, పొల్లాయి లోకనాథం, తట్ట హేమదాస్, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ప్రభుత్వం బిసి వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ తహశీల్దార్ లావణ్యకు టిడిపి నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు కాళ్ల ధర్మారావు, సాలీనా ఢిల్లీ యాదవ్ మాట్లాడుతూ 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఒక్క రూపాయి కూడా వాటికి ఖర్చుచేయకపోవడం దారుణమన్నారు. వారితో పాటు నందిక జాని, దక్కత ఢిల్లీరావు, లీలారాణి, నందిగాం కోటేశ్వరరావు, పత్రి తవితయ్య, జిలానీ, కాళ్ల అర్జున్, కొండ శంకర్‌రెడ్డి, కామేశ్వరరావు, సహదేవ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: బిసిలకు జరుగుతున్న అన్యాయానికి నిరసనగా టిడిపి కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు టిడిపి నాయకులు ర్యాలీ చేపట్టారు. అనంతరం తహశీల్దార్ ఈశ్వరమ్మకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో టిడిఇప మండల అధ్యక్షులు బోయిన రమేష్, మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ, వెలమల కామేశ్వరరావు, హెచ్.అప్పలరాజు, ఎం.ప్రకాష్, ఎం.రామదాసు, దేవాది సింహాద్రి, ఆర్.లీలామోహన్, ఎల్.శ్రీనివాస్, కె.సునీల్, తదితరులు పాల్గొన్నారు.

నందిగాం: బిసిలకు న్యాయం చేయాలని కోరుతూ తాహశీల్దార్ ఎం.సుధారాణికి టిడిపి నాయకులు వినతిపత్రం అందించారు. బిసి సబ్‌ప్లాన్ నుంచి స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ల వరకు ప్రతిదానిలో నారాధరణకు గురవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో పినకాన అజయ్‌కుమార్, పి.చంద్రశేఖరరావు, ఎం.సింహాచలం, ఎ.రవిప్రసాద్, జనకిరావు, సుదర్శనరావు, కృష్ణారావు, మహేష్ పాల్గొన్నారు.

కంచిలి: బిసిలకు న్యాయం చేయాలని తహశీల్దార్ హైమావతికి టిడిపి నాయకులు వినతిపత్రం అందించారు. వినతిపత్రం అందించిన వారిలో నాయకులు జగదీష్ పట్నాయక్, కామేష్‌రెడ్డి, మోహన్‌పట్నాయక్, మాదిన ప్రసాద్ పట్నాయక్, కొరయ్య, హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి: బిసిలకు న్యాయం చేయాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయం వద నిరసన తెలిపారు. బిసిలకు రుణాలు, స్కాలర్‌షిప్స్ ఇవ్వడం లేదని అన్నారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో టిడిపి మంల అధ్యక్షులు బి.శేషగిరి, కోళ్ల లవకుమార్, కిరణ్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.


సంతబొమ్మాళి : వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


బూర్జ : వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


ఇచ్ఛాపురం: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సోంపేట: బిసిలకు న్యాయం చేయాలని టిడిపి నాయకులు తహశీల్దార్ రమేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. వినతిపత్రం అందించిన వారిలో నాయకులు సూరాడ చంద్రమోహన్, చిత్రాడ శ్రీను, చిత్రాడ శేఖర్, మద్దిల నాగేశ్వరరావు, డి.మధు, బి.ఆనందరావు, బి.శ్రీకాంత్, పి.రవి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : బిసిలపై ప్రభుత్వ వైఖరిని తప్పుపడుతూ తహశీల్దార్‌కు టిడిపి నాయకులు వినతిపత్రం అంద ఇంచారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్లలో బిసిలకు న్యాయం జరగలేదన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు జీరు భీమారావు, పుక్కళ్ల శ్రీనివాసరావు, మెండ త్రినాథ్, రమణారెడ్డి, వెంకటేష్, బి.అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

బిసిల వ్యతిరేకి జగన్

పొందూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి బిసిల వ్యతిరేకి అని, బిసిలకు జరిగే అన్యాయాన్ని నిలదీస్తామని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన టిడిపి సానుభూతుపరుల కుటుంబాలను పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వంలో గాని, వైసిపి పార్టీలో గాని సిఎం తన సామాజిక తరగతికి చెందిన వారికే పెద్దపీట వేస్తున్నారే తప్ప... ఇతర సామాజిక తరగతులను చిన్నచూపు చూస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో కీలక పదవులన్నీ రెడ్డి సామాజిక తరగతి వారికే కట్టబెట్టారని తెలిపారు. ఈయనతో పాటు తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ శంకరభాస్కరరావు ఉన్నారు.


కృష్ణాపురంలో పరామర్శిస్తున్న రవికుమార్


సమీక్షిస్తున్న కమిషనర్ రవిసుధాకర్

తనిఖీలు పక్కాగా ఉండాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

పాఠశాలల్లో విద్య, వసతి ప్రమాణాల పెంపునకు నిర్దేశించబడిన తనిఖీలను పక్కాగా నిర్వహించాలని కమిషనర్ ఎం.రవిసుధాకర్ సచివాలయ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ర్యాలయంలో వార్డు సచివాలయ కార్యదర్శులతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగ బలోపేతానికి ఇస్తున్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని తగు చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకుగాను వివిధ కార్యదర్శులకు నిర్దేశించిన ప్రమాణాల విషయంలో సునిశితంగా తనిఖీలు చేపట్టి తగు సమాచారాన్ని ఆన్‌లైన్ యాప్ ద్వారా క్షేత్రస్థాయి నుంచే పరిస్థితులను నివేదించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. ఈ సమీక్షలో మున్సిపల్ మేనేజర్ బి.లక్ష్మీనారాయణ, ప్రజారోగ్య విభాగం ఎఇ బి.సృజన, వార్డు సచివాలయాల ఎమినిటీస్, డేటా ప్రాసెసింగ్ కం ఎడ్యుకేషన్, ఆరోగ్య, మహిళా కార్యదర్శులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జుత్తు తాతారావు

వైసిపి పాలనలో రక్షణ లేదు

ప్రజాశక్తి- పలాస

వైసిపి పాలనలో ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని, పలాస నియోజకవర్గంలో ప్రజలు ప్రశాంతంగా జీవించలేకపోతున్నారని విశ్రాంత ఆదాయ పన్నులశాఖ అసిస్టెంట్ కమిషనర్ జుత్తు తాతారావు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని సుమ్మాదేవి గ్రామంలో ఉద్దానం ఐదు పంచాయతీల ముఖ్య నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో ప్రభుత్వ స్థలాలతో పాటు ప్రైవేట్ వ్యక్తుల స్థలాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమైపోతున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారని అన్నారు. గ్రామాల్లో సరైన రోడ్లు వేసే పరిస్థితి లేదన్నారు. పలాస నియోజవర్గ ప్రజలకు నా వంతుగా ఏదో చేయాలన్న ఉద్దేశంతో రాజకీయాల వైపు రావడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా నారా లోకేష్‌ను కలిశానని అన్నారు. పలాస, మందస మండలాల్లో పలు సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. నియోజకవర్గం పరిధిలో యాదవులు, మత్స్యకారులు, గిరిజనుల సమస్యలపై దృష్టి పెట్టినట్లు చెప్పారు. సమావేశంలో మాజీ సర్పంచ్ బొడ్డు సుధాకర్, రెయ్య భాస్కరరావు, జినగ కృష్ణ, పుచ్చ భాస్కరరావు, పుచ్చ వీరాస్వామి, తెప్పల ఢిల్లీ, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

శ్రీకాకుళం అర్బన్ : 1978-81 మధ్య కాలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ఎంపిసి పూర్తి చేసి 41 ఏళ్ల తర్వాత తిరిగి సమావేశం నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ, పూర్వ విద్యార్థుల సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ డి.పైడితల్లి తెలిపారు. తాము చదువుకున్న తరగతి గది రూమ్ నంబరు-6 (గేలరీ)లో విద్యార్థినీ విద్యార్థుల సమక్షంలో ఆనాటి అనుభవాలను గుర్తుకు తెచ్చుకున్నారు. కార్యక్రమంలో నవోదయ విశ్రాంత ప్రిన్సిపాల్ అనురాధ, ఎస్‌బిఐ విశ్రాంత చీఫ్ మేనేజర్ చంద్రశేఖర్, ఎస్‌బిఐ శ్రాంత డిప్యూటీ మేనేజర్ శంకర్, విశాఖ స్టీల్ ప్లాంట్ కాంట్రాక్టర్ అహ్మద్ పాల్గొన్నారు.


భూమి పూజ చేస్తున్న సర్పంచ్ నర్తు వరప్రసాద్

చేపల మార్కెట్ అభివృద్ధి పనులకు భూమిపూజ

ఇచ్ఛాపురం: మండలంలోని ఈదుపురంలో అసంపూర్తిగా ఉన్న ఫిష్ మార్కెట్‌ను మండల పరిషత్ నిధులు రూ.ఐదు లక్షలతో పూర్తి చేసేందుకు సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నర్తు వరప్రసాద్, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ మాట్లాడుతూ కంద్ర కులస్తుల వ్యాపారాభివృద్ధికి ఈ ఫిష్ మార్కెట్ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి దువ్వు వివేకానందరెడ్డి, ఎంపిటిసి ప్రతినిధి నర్తు ప్రేమ్‌కుమార్‌యాదవ్, ఉప సర్పంచ్ మురా బెహరా, గయా రామచంద్ర, జె.సతీష్‌రెడ్డి, బొనమాలి, చందు, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎండియు ఆపరేటర్లకు న్యాయం చేయాలి

సంతబొమ్మాళి: ఎండియు ఆపరేటర్లకు న్యాయం చేయాలని తహశీల్దార్ జె.చలమయ్యకు ఎండియు ఆపరేటర్లు సోమవారం వినతిపత్రం అందించారు. మండలంలో రెండు నెలలుగా ముగ్గురు ఎండియు ఆపరేటర్‌లకు జీతాలు రావడం లేదని, వారికి జీతాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ జె.చలమయ్యను కోరారు. ఎండియు. బండికు ఇన్సురెన్స్ ప్రభుత్వమే చెల్లించాలి కోరారు. కార్యక్రమంలో ఎండియు ఆపరేటర్‌లు ఎస్.తిరుపతిరావు, డొక్కరి నీలకంఠం, పైల తులసిరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లను నిర్మించాలని వినతి

రణస్థలం : ఎచ్చెర్ల నియోజకవర్గంలో అధ్వానంగా ఉన్న రహదారులను సత్వరమే నిర్మించాలని టిడిపి నాయకులు, పొందూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో భాగంగా రణస్థలం నుంచి పిట్టపాలెం వరకు, తెప్పలవలస పంచాయతీ కొత్తపేట మిందిపేట వరకు, లావేరు మండలం ఇజ్జాడపాలెం నుంచి లూకలపుపేట వరకు నూతన రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ మేరకు జిల్లా రెవెన్యూ అధికారి, అదనపు మేజిస్ట్రేట్ ఎం.రాజేశ్వరిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు.

నేలను కాపాడుకుందాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రపంచ నేల దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ సిపాన నీలవేణి మాట్లాడుతూ భూమి ఆరోగ్యం, సమతుల్యత, మానవాళి ఆహారం, ఇంధనం, నార ఉత్పత్తి, పశువుల పశుగ్రాసానికి నేల అనేది ఆధారమన్నారు. సేంద్రీయ వ్యవసాయం ప్రస్తుత పరిస్థితుల్లో భూమి ఆరోగ్యాన్ని కాపాడి మానవాళి మనుగడకు అవసరమైన ఉత్పత్తిని ఇవ్వడంతో పాటు పర్యావరణాన్నీ పరిరక్షిస్తుందని పేర్కొన్నారు. పశువుల, వానపాముల ఎరువు, వేప పిండి తదితర పంటల దిగుబడితో పాటు నేలసారాన్ని నీటిని పట్టి మొక్కకు అందించే గుణాన్ని మెరుగుపరుస్తాయని అన్నారు. భూమి, నీరు వంటి ప్రకృతి వనరులను పరిరక్షించుకోవడం ద్వారా భావితరాల భవిష్యత్ బాగుంటుందని అన్నారు. ఏక పంటలు కన్నా మిశ్రమ పంటలు



ఆమదాలవలస : మాట్లాడుతున్న బాలకృష్ణ

వేసుకోవడం ద్వారా భూమి సారం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ సిహెచ్.బాలకృష్ణ, డాక్టర్ వి.హరికుమార్, డాక్టర్ ఎస్.అనూష, డాక్టర్ ఆర్.కిషోర్, ప్రొఫెసర్ డాక్టర్ డి.శేఖర్, సైంటిస్ట్ డాక్టర్ వెంకటరావు, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రణస్థలం: నేల నుంచి అన్నీ పొందుతూ ఆ నేలనే నాశనం చేస్తున్నారని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ అసిస్టెంట్ మేనేజర్ బి.పృథ్వీరామ్ ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్



రణస్థలం : మాట్లాడుతున్న పృథ్వీరామ్

రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యాన పైడిభీమవరంలో ప్రపంచ నేల దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. విచ్చలవిడిగా పాలిథిన్, ప్లాస్టిక్ వాడకం, వ్యవసాయంలో పురుగు మందులు ఇలా ఎన్నో అంశాలు నేలను పనికిరాకుండా చేస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సహాయ మేనేజర్ కె.హామిక, సిమ్రన్ ఠాకూర్, లక్ష్మీనరసింహమూర్తి, దేవుడుబాబు, తవిటినాయుడు, నారాయణరావు, గణేష్, కృష్ణ పాల్గొన్నారు.

సచివాలయం వద్ద మహిళల ఆందోళన

పలాస : సచివాలయ సెక్రటరీ పనితీరును నిరసిస్తూ మహిళలు సోమవారం ఆందోళన చేపట్టారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 15వ సచివాలయంలో ఎడ్మిన్, సెక్రెటరీ లేకపోవడంతో అదే సచివాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న సంతోషికి అదనపు బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి ఆమె నియంతల వ్యవహరిస్తూ ప్రజలను ముప్పు తిప్పలు పెడుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆమె విధులకు సమయానికి రావడం లేదని, వచ్చినా ఫీల్డ్ పేరుతో బయటకు వెళ్తున్నారని, దీంతో ఆమె ఎప్పుడొస్తారా? అని సచివాయలం వద్ద ఎదురుచూడాల్సి వస్తోందని స్థానికులు చెప్తున్నారు. ఇంటి పన్ను చెల్లింపులో ఆలస్యం జరిగితే ఇంటికి తాళాలు వేస్తాం, ప్రభుత్వ పథకాలు ఆపేస్తాం అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని స్థానికులు


సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న మహిళలు

వాపోతున్నారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న సంతోషినిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్‌లో పరిస్థితిని వివరించారు. అయితే కమిషనరు సెలవులో ఉన్నారని, రెండు రోజుల్లో ఆమెను అడ్మిన్ బాధ్యతల నుంచి తప్పిస్తామని గిరిబాబు స్థానికులకు నచ్చజెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

జంగిల్ క్లియరెన్స్ చేపట్టరూ..


సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆటో డ్రైవర్లు

కోటబొమ్మాళి: మండలంలోని పాకివలస గ్రామం నుంచి కొత్తపల్లి గ్రామానికి వెళ్లే రహదారిలో రోడ్డుకు ఇరువైపుల పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు విపరీతంగా పెరిగిపోవడంతో వాహనదారులకు ఎదురుగా వచ్చిన వాహనాలు కనబడక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, వెంటనే జంగిల్ క్లియరెన్సు చేపట్టాలని టిఎస్‌టియుసి అధ్యక్షుడు జి.నర్సింగరావు, ఆటో డ్రైవర్లు కోరారు. ఈ విషయమై మండల పరిషత్ సూపరింటెండెంట్ ఎస్.రాజేశ్వరమ్మకు, దంత, కొత్తపల్లి, కురుడు సచివాలయ అధికారులకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పాకివలస నుంచి కొత్తపల్లి వరకు వెళ్లే మార్గంలో జంగిల్ క్లియరెన్సు చేయకపోవడంతో పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగిపోవడంతో మలుపులు వద్ద ఎదురుగా వచ్చిన వాహనాలు కనిపించక, మలుపులు వద్ద ఉన్న స్పీడ్ బ్రేకర్లు సగం పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఆయనతో పాటు టి.రమేష్, డి.యరకన్న, ఎస్.శ్రీనివాసరావు, జి.లక్ష్మణరావు, ఎం.వైకుంఠరావు, ఆర్.అప్పలస్వామి, జి.మల్లి, ఎస్.మహేష్, ఎస్.రాజు, కె.దుర్గ, ఎస్.అప్పారావు, ఎం.లక్ష్మణరావు, తదితరులు ఉన్నారు.

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

మున్సిపల్ చైర్మన్ గిరిబాబు

ప్రజాశక్తి- పలాస

మున్సిపాలిటీ పరిధిలో నిర్మాణం జరుగుతున్న భవనాలు నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు పేర్కొన్నారు. తర్లకోట పంచాయతీ పరిధిలో మున్సిపాలిటీలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్మాణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మాణం


పనులను పరిశీలిస్తున్న చైర్మన్ గిరిబాబు

చేపడుతున్నట్లు తెలిపారు. పురపాలక సంఘం పరిధిలోని ఇళ్ల నుండి ప్రతి రోజూ చెత్త సేకరణ చేసిన చెత్త నుండి సంపదను సష్టించటానికి ఈ యూనిట్ నిర్మాణం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

రూ.257 కూలి వచ్చేలా చర్యలు


మాట్లాడుతున్న అప్పారావు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

రోజుకు రూ.257 కూలి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎంపిపి ప్రతినిధి మేరుగు అప్పారావు అన్నారు. సోమవారం ఎంపిపి ప్రతినిధి అధ్యక్షతన ఉపాధి హామీ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్‌లు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు సమన్వయంతో పని చేయాలన్నారు. ఉపాధి హామీలో ఎటువంటి అవకతవకలు జరగకుండా పనుల సక్రమంగా జరిగేలా ప్రజా ప్రతినిధులు తరచూ చూడాలని అన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, ఎపిడి మురళీకృష్ణ, ఎంపిడిఒ ఉమాసుందరి, సర్పంచ్‌లు దుక్క భూషణరెడ్డి, జోగి రాములమ్మ, రెయ్య రామిరెడ్డి, కె.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యల నివారణపై అవగాహన

సోంపేట: క్షణకావేశానికి గురై ఆత్మహత్యలకు పాల్పడటం సరికాదని, విచక్షణతో మెలగాలని స్పందన ఇదా ఇంటర్నేషనల్ సంస్థ జిల్లా ఉపాధ్యక్షుడు మూల వీరన్న అన్నారు. స్థానిక కృష్ణసాయి కళాశాలలో సోమవారం విద్యార్థులకు ఆత్మహత్యల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షణికావేశాలకు గురై ఎంతోమంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు శారీరక దృఢత్వంతో పాటు మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. స్థిత ప్రజ్ఞత



అవగాహన కల్పిస్తున్న వీరన్న

అలవర్చుకుంటే ఏ సమస్యనైనా అధిగమించవచ్చు అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తేజ, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన ఎఫ్ఎ-2 పరీక్షలు

ప్రజాశక్తి- టెక్కలి

విద్యాశాఖ ఆధ్వర్యాన ఒకటవ తరగతి నుంచి పదో తరగతి వరకు నిర్వహించిన ఎఫ్ఎ-2 పరీక్షలు సోమవారంతో ముగిశాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆనేక ఒత్తిళ్ల మధ్య పరీక్షలు పూర్తి చేశారు. జిల్లా పరీక్షల విభాగం సూచనల మేరకు వాట్సాప్‌లో వచ్చిన ప్రశ్నాపత్రాన్ని విద్యార్థులకు బోర్డుల మీద రాసే క్రమంలో ఒకానొక దశలో ఉపాధ్యాయులకే పరీక్షలుగా భావించాల్సిన పరిస్తితి ఏర్పడింది. ఎప్పుడూ లేని విధంగా ఈ సారి ఎఫ్ఎ-2 పరీక్షలు నిర్వహించడం వల్ల అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులు మానసిక ఆందోళనకు గురయ్యారు. జవాబుపత్రాల్ని మూల్యాంకనం చేసి ఈ నెల 6,7,8 తేదీల్లోగా మార్కులు రిజిస్టర్‌లో నమోదు చేయాలని పాఠశాల విద్యాశాఖాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వీరి ఉత్తర్వుల మేరకు కేటాయించిన తేదీల్లోనే ఆన్‌లైన్లో మార్కులు వేయాలని ఆధికారులు సూచనల మేరకు జవాబు పత్రాలు మూల్యాంకనం జరుగుతుంది. ఏదిఏమైనా పరీక్షలు పూర్తి ఆయినప్పటికీ భవిష్యత్‌లో పరీక్షలు ఏ విధంగా ఆధికారులు నిర్వహిస్తారో వేచి చూడాలి.


మాట్లాడుతున్న ఉమా సుందరి

ఎంపిడిఒ ఆకస్మిక తనిఖీ

సంతబొమ్మాళి: పాలతలగాం సచివాలయాన్ని ఎంపిడిఒ జి.ఉమాసుందరి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, హాజరు తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది సంక్షేమ పథకాలు అమల్లో ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ వెళ్లాలి అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నక్కిట్ల అప్పన్న, ఎంపిటిసి ప్రతినిధి అట్టాడ అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి క్రరి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

రత్తకన్నలో ఉచిత వైద్య శిబిరం

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలోని రత్తకన్నలో సోమవారం 18, 19, 20 వార్డు ప్రజాప్రతినిధులు సిహెచ్ జగన్నాయకులు, బొబ్బిలి భూదేవి, తాడి ఆదిరెడ్డి, గ్రామ యూత్ ఆధ్వర్యాన ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. రాగోలు జెమ్స్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ కె.కార్తిక్, డాక్టర్ తపస్విని రోగులకు మూత్రపిండాలు, గుండె, కేన్సర్, తదితర వ్యాధులకు సంబంధించి 200 మందికి పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందించారు. ఈ శిబిరంలో మార్కెట్ మేనేజర్ శ్రీధర్, పిఆర్ఒ సంతోష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇజ్జడపాలెం పాఠశాల సందర్శన

లావేరు : విద్యార్థులకు విలువలతో కూడిన గుణాత్మక విద్యను అందించాలని గోవిందపురం సర్పంచ్ పిల్లా రాము అన్నారు. మండలంలోని ఇజ్జడపాలెం యుపి పాఠశాలను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అలాగే మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలన్నారు.


వంటలను పరిశీలిస్తున్న ఎంపిడిఒ, సర్పంచ్

ఆశ్రమ పాఠశాల తనిఖీ

కంచిలి: మండలంలోని నువగడ గిరిజన ఆశ్రమ పాఠశాలను ఎంపిడిఒ చల్లా శ్రీనివాసరెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు యారాడి ఆనందరావు సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందజేస్తున్న భోజనాలను పరిశీలించారు. ప్రభుత్వం అందజేస్తున్న మెనూ ప్రకారం ఆహార పదార్థాలు అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. వసతి, భోజనాలు, బోధన వంటి అంశాలను గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.


ధాన్యం తూకం వేస్తున్న ఎంపిపి సత్యవతి

దళారులను నమ్మి మోసపోవద్దు

ప్రజాశక్తి- జి.సిగడాం

రైతు పండించే పంటను రైతు భరోసా కేంద్రం ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ఎంపిపి సత్యవతి అన్నారు. జి.సిగడాం వ్యవసాయ కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎఒ ఎ.శారద మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారు పండించే ధాన్యాన్ని ఆర్‌బికె ద్వారా తమ వ్యవసాయ సహాయకులు కొనుగోలు చేస్తారని సూచించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి కాయల రమణ, తహశీల్దార్ వేణుగోపాల్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెంకటసాయి, ఎస్.పి.ఆర్.పురం సర్పంచ్ కంది రమాదేవి, కంది సాయికిరణ్, కిరణ్ పాల్గొన్నారు.


పోస్టర్‌ను అందజేస్తున్న యువసేన

ఇంటింటికీ 'ఎంజిఆర్'

మెళియాపుట్టి : మండలంలోని తంగిణి, సంతోషపురం, భవానపురం, భవానపురం కాలనీ, మకానపురం, బంజీరు, భరణికోట, భరణికోట కాలనీ, జన్ని వీధి, మర, బాలేరు గ్రామాల్లో ఎంజిఆర్ యువసేన సోమవారం ఇంటింటికీ ఎంజిఆర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సామాజిక వేత్త, టిడిపి నాయకులు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ఆపద అంటే అండగా నిలిచిన ప్రజా సేవకుడు మామిడి గోవిందరావు అని అన్నారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తారని, ఆయనను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో పట్టుపురం ఎంపిటిసి ప్రతినిధి నంబాల వెంకటరావు, సనపల తిరుపతిరావు, ధనుపురం మాజీ సర్పంచ్ మామిడి గంగాధర్, తామర మాజీ సర్పంచ్ సిరిపురం బాబూరావు, ఎంజిఆర్ యువసేన అధ్యక్షులు పోతురాజు శ్రీధర్, చేపర కిషోర్ పాల్గొన్నారు.


కళాజాతా నిర్వహిస్తున్న కళా బృందం

ఎయిడ్స్ నివారణపై అవగాహన

కొత్తూరు : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యాన శ్రీకాకుళం వారిచే శ్రీనివాస కళా బృందం సోమవారం కళాజాతా, వీధి నాటకం ప్రదర్శించి విద్యార్థులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసిటిసి కంట్రోలర్ చింతాడ భాస్కరరావు ఎయిడ్స్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బండారు రవికుమార్, అధ్యాపకులు కె.గోవిందరావు, లక్ష్మీనారాయణ, సర్వేశ్వరరావు, అంగన్వాడీ కార్యకర్త జలజాక్షి, ఆశా వర్కర్లు రత్నకుమారి, రమణమ్మలు పాల్గొన్నారు.


పరామర్శిస్తున్న వైసిపి నాయకులు

వైసిపి నాయకుల పరామర్శ

పొందూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల పలు కారణాలతో మృతి చెందిన పలువురి కుటుంబాలను జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్‌లు సోమవారం పరామర్శించారు. మండలంలోని తుంగపేట, తండ్యాం, కేశవదాసుపురంతో పాటు పలు గ్రామాల్లో మృతుల కుటంబాలను పరామర్శించారు. వీరితో పాటు మండల సర్పంచ్ సంఘం అధ్యక్షులు మొకర శంకరరావు, కిల్లి నాగేశ్వరరావు, వడగా మోహన్, బాడాన వెంకట కృష్ణారావు, కూన రమణమ్మ, మీసాల రమణ ఉన్నారు.

దుప్పలవలసలో అన్నదానం

శ్రీకాకుళం అర్బన్ : ఎచ్చెర్ల మండలం దుప్పలవలసలో భవానీ సోమేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం ముగింపు సందర్భంగా సోమవారం అన్నదానం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మార్కండేయ నవీన్ ఆధ్వర్యాన ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. దుప్పలవలస, తోటపాలెం గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.


అన్నదానంలో పాల్గొన్న విద్యార్థులు